పోచమ్మమైదాన్: బతుకమ్మ ఆడుతున్న మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్య శారద, ఖిలావరంగల్: కోటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, గిర్మాజీపేట: వరంగల్ దుర్గేశ్వరస్వామి ఆలయ ఆవరణలో.., కాశీబుగ్గ: వరంగల్ 3వ డివిజన్ ఆరెపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఎంగిలిపూల సందడి

- బతుకమ్మ వేడుకలు ప్రారంభం
- మొదటి రోజు ఘనంగా వేడుకలు
- ఆడిపాడిన ఆడబిడ్డలు, మహిళా అధికారులు, ప్రజాప్రతినిధులు
- తోట మైదానంలో మంత్రి, మేయర్, కలెక్టర్ సందడి

ఖానాపురంలో బతుకమ్మలతో తరలివస్తున్న మహిళలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: ఎంగిలిపూలతో బుధవారం జిల్లావ్యాప్తంగా బతుకమ్మ సందడి మొదలైంది. ఈ సందర్భంగా తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను సాయంత్రం ఆడబిడ్డలు గ్రామ, పట్టణ, నగర కూడళ్లకు తీసుకెళ్లి ఒకచోట ఉంచారు. అనంతరం బతుకమ్మల చుట్టూ తిరుగుతూ రాత్రి పొద్దుపోయే వరకూ ఆటపాటలతో సందడి చేశారు. నృత్యాలు, కోలాటాలతో హోరెత్తించారు. తర్వాత చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేసి ముత్తయిదువలు వాయినాలు ఇచ్చిపుచ్చుకొని ఇండ్లకు తిరుగుపయనమయ్యారు. వరంగల్ కొత్తవాడ తోట మైదానంలో రాష్ట్ర దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్య శారద పాల్గొని బతుకమ్మ ఆడారు. మహిళల్లో ఉత్సాహం నింపి వారితో కలిసి బతుకమ్మ పాటలు పాడారు. దేశాయిపేటలోని చిన్న వడ్డేపల్లి చెరువు, పోచమ్మమైదాన్ ఆంజనేయస్వామ ఆలయం, శ్రీనివాస కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, సెకండ్ డాక్టర్స్ కాలనీలోని వరద వేంకటేశ్వర స్వామి ఆలయంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. అలాగే, దుర్గేశ్వరస్వామి ఆలయ ఆవరణలో జరిగిన వేడుకల్లో మంత్రి సురేఖ, మేయర్ సుధారాణి పాల్గొన్నారు. నర్సంపేట పట్టణ పరిధిలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలో మైక్‌లు, బతుకమ్మ ఆడే ప్రాంతాల్లో డీజేలు ఏర్పాటు చేశారు. నర్సంపేట మండలంలోని అన్ని గ్రామాల్లో బతుకమ్మ వేడుకులు వైభవంగా ప్రారంభమయ్యాయి. కరీమాబాద్ అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని 32, 39, 40, 41, 42, 43 డివిజన్లలో మహిళలు బతుకమ్మ ఆడారు. ఖానాపురం మండలవ్యాప్తంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. దుగ్గొండి మండలంలోని గిర్నిబావి హనుమాన్ గుడి వద్ద, నాచినపల్లిలో రామాలయం వద్ద, దుగ్గొండిలోని ప్రధాన కూడళికి తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను ఆడబిడ్డలు తీసుకొచ్చి ఆటాపాటలతో సందడి చేశారు. అలాగే, నల్లబెల్లి మండలంలో ఆడబిడ్డలు సందడి చేశారు. వర్ధన్నపేటలోని రామాలయం పక్కన ఉన్న రామ్‌లీలా మైదానంలో మహిళలు బతుకమ్మ ఆడి ఆకేరువాగులో నిమజ్జనం చేశారు. అలాగే, ఇల్లంద రామలింగేశ్వరస్వామి ఆలయంతో పాటు అన్ని గ్రామాల్లోని ఆలయాల్లో బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. కాగా, సాయంత్రం వర్షం పడడంతో మహిళలు కొంత నిరాశకు గురయ్యారు. సంగెం మండలంలో బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. చెన్నారావుపేటలో రామాలయానికి బతుకమ్మలతో తరలివెళ్లి మహిళలు ఆటాపాటలతో సందడి చేశారు. పర్వతగిరి మండలవ్యాప్తంగా వేడుకలు జరిగాయి. రాయపర్తి మండలంలోని 40 గ్రామ పంచాయతీల పరిధిలో ఎంగిలిపూల బతుకమ్మలతో ఆడబిడ్డలు ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. మండలకేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయం, రుద్రకోటేశ్వరస్వామి ఆలయం, ఉమామహేశ్వరస్వామి ఆలయాల్లో జరిగిన ఎంగిలిపూల బతుకమ్మలతో మండలకేంద్రం పూల సింగిడిని తలపించింది. గీసుగొండ మండలంతోపాటు గ్రేటర్ వరంగల్ 15, 16వ డివిజన్లలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. వరంగల్ స్టేషన్‌రోడ్‌లోని ఆకారపు వారి గుడికి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. అలాగే, రామలింగేశ్వర ఆలయ ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. కాశీబుగ్గ ప్రాంతంలోని కాశీవిశ్వేశ్వర రంగనాథస్వామి ఆలయ ఆవరణ మహిళలతో కిక్కిరిసిపోయింది. బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు ఈ ప్రాంతం మహిళలతో నిండిపోయింది. అనంతరం ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే, ఓసిటీ క్లబ్ హౌస్‌లో, కాశీబుగ్గ సొసైటీ కాలనీలో, కనకదుర్గామాత ఆలయంలో మహిళలు బతుకమ్మ పాటలతో సందడి చేశారు. వరంగల్ 3వ డివిజన్ ఆరెపల్లి, పైడిపల్లి, కొత్తపేట విలీన గ్రామాల్లో మహిళలు పెద్ద ఎత్తున ఎంగిలిపూల బతుకమ్మ ఆడారు. ఆరెపల్లిలోని బీరన్నస్వామి ఆలయంలో దయ్యాల వేణు నిర్వహణలో కురమ సామాజికవర్గం మహిళలతోపాటు స్థానికులు పెద్ద ఎత్తున బతుకమ్మ ఆడారు. నెక్కొండలోని బొడ్రాయి కూడలిలో మహిళలు ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఖిలావరంగల్ పడమరకోట మెట్టు దర్వాజ, మధ్యకోటలోని స్వయంభు శ్రీశంభులింగేశ్వరస్వామి, తూర్పుకోట పోచమ్మ గుడి, శివనగర్ మెట్లబావి, శ్రీతారామచంద్రస్వామి దేవాలయం, ఆదర్శనగర్, స్తంభంపల్లి, వసంతపురం, దూపకుంట, గాడిపల్లి, బొల్లికుంటలో మహిళలు రాత్రి పొద్దుపోయే వరకూ బతుకమ్మ ఆటాపాటలతో సందడి చేశారు. మంత్రి కొండా సురేఖ, మేయర్ సుధారాణి, కలెక్టర్ సత్య శారద తూర్పు నియోజకవర్గంలో జరిగిన బతుకమ్మ సంబురాలకు ముఖ్య అతిథులుగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. శివనగర్, సాకరాశికుంట, ఉర్సు, రంగశాయిపేట, శంభునిపేటలో స్థానిక మహిళలతో కలిసి బతుకమ్మ ఆటాపాటలు నిర్వహించారు.

నర్సంపేటలోని ఆలయం లోపల బతుకమ్మ ఆటలు

వర్ధన్నపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

దుగ్గొండి: గిర్నిబావిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

నర్సంపేట రూరల్ : కమ్మపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

నల్లబెల్లి: మండలకేంద్రంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

నెక్కొండ: బొడ్రాయి సెంటర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, పర్వతగిరి : గోపనపల్లిలో సందడి చేస్తున్న మహిళలు

చెన్నారావుపేటలో బతుకమ్మలతో తరలివస్తున్న ఆడబిడ్డలు, సంగెం: ఆశాలపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, రాయపర్తిలోని రుద్రకోటేశ్వరస్వామి ఆలయంలో ఎంగిలిపూల బతుకమ్మ ఆడుతున్న మహిళలు, గీసుగొండ: శివాలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ప్రతి ఫ్యామిలీకి డిజిటల్ కార్డు

కలెక్టర్ సత్య శారద

ఖిలావరంగల్, అక్టోబర్ 2: ఒకే రాష్ట్రం, ఒకే కార్డు అనే నినాదాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డు కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించేందుకు మార్గదర్శకాలు రూపొందించారని కలెక్టర్ సత్య శారద తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో నేటి నుంచి ఈ నెల 7వ తేదీ వరకు ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పైలట్ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. మార్గదర్శకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, తహసీల్దార్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి, డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

పక్కా సమాచారం సేకరించాలి

వరంగల్: ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం పక్కా సమాచారం సేకరించాలని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో అధికారులు, సర్వే బృందాలకు ఆమె దిశానిర్దేశం చేశారు. డిప్యూటీ కమిషనర్ రవీందర్ సర్వే విధానంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. నేటి నుంచి 7వ తేదీ వరకు హనుమకొండలోని 10, 48 డివిజన్లు, వరంగల్‌లోని 12, 18 డివిజన్లలో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే నిర్వహిస్తామన్నారు. రెండు జిల్లాల డీఆర్‌వోలతో పాటు బల్దియా డిప్యూటీ కమిషనర్లు నోడల్ అధికారులుగా ఉంటారని చెప్పారు. అలాగే, చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్కల తొలగింపు ప్రక్రియలో వేగం పెంచాలని బల్దియా కమిషనర్ ఆదేశించారు. కార్పొరేషన్‌లో సద్దుల బతుకమ్మ, దసరా పండుగల ఏర్పాట్ల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. గ్రేటర్ పరిధిలోని 16 చెరువుల్లో చేపట్టిన గుర్రపు డెక్కల తొలగింపు పనులు ఈ నెల 4లోగా పూర్తి చేయాలన్నారు.

పండుగ వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సీఐ

మట్టెవాడ, అక్టోబర్ 2: బతుకమ్మ, దసరా పండుగను పురస్కరించుకొని సెలవు రోజుల్లో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మట్టెవాడ సీఐ టీ గోపి ఒక ప్రకటనలో సూచించారు. ప్రజలు షాపింగ్ మాల్స్‌లో దుస్తులు, ఇతర వస్తువుల కొనుగోలు కోసం పట్టణ వీధుల్లో చాలా బిజీగా ఉంటారని, రద్దీ ఎక్కువగా ఉండడం వల్ల దొంగలు సంచరించే అవకాశం ఉందన్నారు. అలాగే, బతుకమ్మ, దసరా పండుగకు ప్రజలు సొంత ఊళ్లకు వెళ్తున్న క్రమంలో సెల్‌ఫోన్, లగేజీలతోపాటు మహిళలు బంగారు ఆభరణాల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. దూరప్రాంతాలకు వెళ్లే వారు ఇంటికి సంబంధించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దొంగలు సంచరిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు.

సమాధిపై శిలాఫలకం తొలగింపుపై ఫిర్యాదు

మట్టెవాడ, అక్టోబర్ 2: శ్మశాన వాటికలోని ఓ సమాధిపై ఉన్న శిలాఫలకాన్ని తొలగించి, చనిపోయిన తేదీని మార్చి వేరే శిలాఫలకం పెట్టడంపై మృతుడి కుటుంబ సభ్యులు బుధవారం మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెద్దమ్మగడ్డకు చెందిన బొల్లం యాకోబు 1997 జనవరి 21న మరణించాడు. ఆయన సమాధిపై కుటుంబ సభ్యులు శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో దుండగులు యాకోబు సమాధిపై ఉన్న శిలాఫలకాన్ని తొలగించి కొత్త శిలాఫలకం ఏర్పాటు చేశారు. దీంతో యాకోబు మనవడు విజయ్‌కుమార్ ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సుభాన్‌బాషాను సన్మానిస్తున్న నరేందర్

సుభాన్‌బాషాకు నన్నపునేని సన్మానం

గిర్మాజీపేట, అక్టోబర్ 2: పోచమ్మమైదాన్ న్యూపెయింటర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సుభాన్‌బాషా బుధవారం శివనగర్‌లో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నరేందర్ సుభాన్‌బాషాకు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి స్వామి, ఉపాధ్యక్షుడు రాజు, యాకూబ్‌పాషా, విజయ్, మహేశ్, హఫీజ్, సాదిక్ పాల్గొన్నారు. అలాగే, ఇటీవల నన్నపునేని నరేందర్ సోదరుడు రవికుమార్ మరణించగా, బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ శివనగర్‌లో నన్నపునేనిని కలిసి పరామర్శించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-318996

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

'ప్రకృతిని ప్రేమించే గొప్ప పండుగ'

నర్సంపేట, అక్టోబర్ 2: దేశంలోనే పూలను పూజించి, ప్రకృతిని ప్రేమించే గొప్ప పండుగ బతుకమ్మ అని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలను మహిళలు సంతోషంగా జరుపుకోవాలని కోరారు. తొమ్మిది రోజులపాటు తీరొక్క పువ్వులతో బతుకమ్మ సంబురాలను ఆనందంగా జరుపుకోనున్న ఆడబిడ్డలకు ఈ సందర్భంగా దొంతి శుభాకాంక్షలు తెలిపారు. అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

గాలిదుమారం బీభత్సం

నల్లబెల్లి, అక్టోబర్ 2: గాలిదుమారానికి మండలంలోని పలు గ్రామాలు అతలాకుతలమయ్యాయి. బుధవారం ఒక్కసారిగా గాలిదుమారంతోపాటు అక్కడక్కడా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. బొల్లోనిపల్లె నుంచి రంగాపురం వెళ్లే ప్రధాన రహదారిపై చెట్టు కూలింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలుచోట్ల పిడుగులు పడ్డాయి.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

గీసుగొండ, అక్టోబర్ 2: నందనాయక్‌తండాలో పేకాడుతున్న 8 మందిని పట్టుకున్నట్లు సీఐ బాబులాల్ తెలిపారు. ఓ ఇంట్లో రహస్యంగా పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేసి 8 మందిని పట్టుకున్నామని, వారి నుంచి రూ. 30,780 నగదు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశామని చెప్పారు.

నేడు చేపపిల్లల పంపిణీ

ఖిలావరంగల్, అక్టోబర్ 2: వరంగల్ ఉర్సు రంగ సముద్రంలో గురువారం చేపపిల్లలను పంపిణీ చేయనున్నట్లు జిల్లా మత్స్య శాఖ అధికారి నాగమణి తెలిపారు. జిల్లాలోని 702 చెరువుల్లో 1.50 కోట్ల చేపపిల్లలను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. మొదటి విడుత ఉర్సు రంగ సముద్రం నుంచి మంత్రి కొండా సురేఖ చేతులమీదుగా ప్రారంభిస్తారని నాగమణి పేర్కొన్నారు.

అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

జడ్పీ సీఈవో రాంరెడ్డి

గీసుగొండ, అక్టోబర్ 2: గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని జడ్పీ సీఈవో రాంరెడ్డి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలకేంద్రంలోని జీపీ కార్యాలయంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ప్రజలు భాగస్వాములు అయినప్పుడే గ్రామాలు మరో గంగదేవిపల్లి, మరియపురం తరహాలో అభివృద్ధి సాధిస్తాయన్నారు. తహసీల్దార్ రియాజుద్దీన్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి దాతల సహకారం కావాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ కన్సల్టెంట్ ఆశాలత, డీఆర్డీవో కౌసల్యాదేవి, స్వచ్ఛ భారత్ కన్సల్టెంట్ శ్రీనివాసారావు, వైద్యాధికారి దేవేందర్, ఎంపీడీవో కమలాకర్, ఎంపీవో ప్రభాకర్, ఏపీఎం సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్పీ సీఈవో రాంరెడ్డి

జీపీ సిబ్బంది పాత్ర కీలకం

చెన్నారావుపేట: గ్రామల పరిశుభ్రతలో జీపీ సిబ్బంది పాత్ర చాలా కీలకమని ఎంపీడీవో శ్రీవాణి, ప్రత్యేకాధికారి బాలకృష్ణ అన్నారు. మండలంలోని లింగగిరి జీపీ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి మంగీలాల్, మండల పరిషత్ సూపరింటెండెంట్ అయేషా పర్వీన్, సీనియర్ అసిస్టెంట్ నరేందర్, టైపిస్ట్ రజిత, కార్యదర్శి శ్యామ్ పాల్గొన్నారు.

రసాభాసగా ఖాదర్‌పేట గ్రామసభ

చెన్నారావుపేట: ఖాదర్‌పేట గ్రామసభ రసాభాసగా సాగింది. పలు అంశాలపై సాగిన గ్రామసభలో పెండింగ్ బిల్లులు రావాలని మాజీ సర్పంచ్ అనుముల కుమారస్వామి ప్రస్తావించారు. అయితే, స్వర్గరథం రిపేరు పేరుతో బిల్లులు వాడుకున్నావని కాంగ్రెస్ నాయకులు అనడంతో ఇరు పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. తానే స్వర్గరథాన్ని రిపేరు చేయించానని, బిల్లులు రావాల్సి ఉందని మాజీ సర్పంచ్ సభలో తెలిపారు. అనంతరం వచ్చే సంవత్సరానికి సంబంధించి ఈజీఎస్ పనులు, బతుకమ్మ ఏర్పాట్లపై చర్చించారు. కార్యదర్శి వీరన్న, నాయకులు పాల్గొన్నారు.

బెల్టు షాపుపై టాస్క్‌ఫోర్స్ దాడులు

ఖిలావరంగల్, అక్టోబర్ 2: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాకరాశికుంటకు చెందిన ఎనగందుల లలిత(55) బెల్టు షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకొని దాడులు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. రూ. 38,220 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకొని, తదుపరి విచారణ కోసం ఆమెను మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు ఏసీపీ తెలిపారు.

సమష్టి కృషితో విజయవంతం చేస్తాం

కాశీబుగ్గ, అక్టోబర్ 2: కాశీబుగ్గ రావణవధ ఉత్సవాలను సమష్టి కృషితో విజయవంతం చేస్తామని ఉత్సవ సమితి కన్వీనర్ బయ్యా స్వామి, ప్రధాన కార్యదర్శి సముద్రాల పరమేశ్వర్ అన్నారు. మంగళవారం రాత్రి కాశీబుగ్గ సెంటర్‌లో ఉత్సవ సమితి సభ్యుల సమావేశం అధ్యక్షుడు దూపం సంపత్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. రాజకీయాలకతీతంగా ఉత్సవాలు నిర్వహించాలని తీర్మానించామన్నారు.

వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం

గీసుగొండ, అక్టోబర్ 2: వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంటలోని ఆనంద వృద్ధాశ్రమంలో గాంధీ జయంతి సందర్భంగా బుధవారం మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

శారదా శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం

పోచమ్మమైదాన్, అక్టోబర్ 2: వరంగల్‌లోని శృంగేరి శంకర మఠంలో శృంగేరి సంప్రదాయంలో శారదా శరన్నవరాత్రోత్సవాలను బుధవారం ప్రారంభించారు. ప్రధానార్చకుడు సంగమేశ్వరజోషి, అర్చకులు చంద్రశేఖర శర్మ, అన్నావజ్జుల సోమశేఖరశర్మ అమ్మవారికి పంచసూక్తలతో సకల నది జలాలతో మహాభిషేకం చేశారు. అనంతరం భక్తులు సమర్పించిన పసుపుతో శ్రీశారద అమ్మవారికి విశేష హరిద్రా అలంకరణ చేశారు.

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రోత్సవాలు

వర్ధన్నపేట, అక్టోబర్ 2: దేవీ శరన్నవరాత్రోత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయి. మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో, ఇల్లందలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వాహకులు అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి తొమ్మిది రోజులపాటు పూజలందించనున్నారు. అమ్మవారి విగ్రహాలను నిర్వాహకులు హైదరాబాద్, వరంగల్ నగరాల నుంచి తీసుకొచ్చారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్

శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడొద్దు

నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్

ఖానాపురం, అక్టోబర్ 2: శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడొద్దని నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన ఖానాపురం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, పరిసరాలు, సిబ్బంది పరేడ్, కిట్లను పరిశీలించారు. కేసులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. గుడుంబా, గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఆయన వెంట దుగ్గొండి సీఐ సాయి వెంకటరమణ, ఎస్సై రఘుపతి, సిబ్బంది ఉన్నారు.

6న ఉద్యమకారుల సదస్సు

నల్లబెల్లి అక్టోబర్ 2: ఈ నెల 6న జరుగనున్న తెలంగాణ ఉద్యమకారుల సదస్సును విజయవంతం చేయాలని జనసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన ఉద్యమకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను సాధించుకునేందుకు ఈ నెల 6న సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న అంబటి శ్రీనివాస్